క్లుప్తంగా

జంతు వధ నిషేధం

నగరి: గాంధీ జయంతి సందర్భంగా గురువారం మున్సిపల్ పరిధిలో మాంస విక్రయాలు, జంతు వధ నిషేధమని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంసం, చేపలు, రొయ్యలు, పీతలు లాంటివి విక్రయించరాదని పేర్కొన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య చట్ట ప్రకారము వ్యాపార లైసెన్సులు రద్దు పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు పండ్లు పంచుతున్న కిరణ్‌కుమార్

కార్వేటినగరం: రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్టేట్ బ్యాంకు మేనేజర్ జె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులు చంటి పిల్లలతో సమానమని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి, పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. బాలకృష్ణారెడ్డి, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

104 సేవలు వినియోగించుకోండి



104కు ఆయుధపూజ చేసిన సిబ్బంది

పాలసముద్రం: మండల పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్ తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణలో 104 వాహన డీఈఓ శరవణన్, పైలట్ రమేష్, ఆరోగ్య సిబ్బంది కలిసి 104 వాహనానికి ఆయుధ పూజ చేశారు. 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా కార్యాలయాల పనివేళల పెంపు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు డివిజన్‌లో తపాలా కార్యాలయాల పనివేళలను పెంచినట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు డివిజన్ పరిధిలోని 9 తపాలా కార్యాలయాల పనివేళలను పెంచుతున్నట్లు చెప్పారు. చిత్తూరు ప్రధాన కేంద్రంలో పనివేళలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు, మదనపల్లె ప్రధాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పలమనేరు ఎండీజీ, చిత్తూరు కలెక్టరేట్ ఎస్‌ఓ, పుంగనూరు ఎస్‌ఓలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, కుప్పంలో ఉదయం 8.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.45, మదనపల్లె బజార్ ఎస్‌ఓలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30, బి.కొత్తకోట ఎస్‌ఓలో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 3, చౌడేపల్లి ఎస్‌ఓలో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇకపై పనివేళలుగా ఉంటాయని వెల్లడించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు దామోదర్‌నాయుడు కుటుంబానికి ఎస్పీ తుషార్ డూడీ అండగా నిలిచారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ బెనిఫిట్ ఫండ్ నుంచి రూ.3.50 లక్షలను పిల్లలు ఇద్దరి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ పత్రాలను వాళ్ల కుటుంబసభ్యులకు అప్పగించారు. బుధవారం చిత్తూరులోని పోలీస్ కార్యాలయంలో మృతుడి భార్య ఆర్తికి సీ కేటగిరీ కింద ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. ఏఎస్పీ రాజశేఖర్ రాజు, ఎంటీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా మెలగాలి

బంగారుపాళెం: సమాజంలో పౌరులు బాధ్యతగా మెలగాలని తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లెలో పౌరుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పౌరులు తమ హక్కులను ఇతరులకు ఇబ్బంది కలగకుండా వినియోగించుకోవాలన్నారు. పౌరులు బాధ్యతగా నడుచుకున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో అంటరానితనాన్ని విడనాడాలని సూచించారు. అణగారిన వర్గాలపై దాడులు చేసే శక్తులపై ప్రభుత్వం కఠినంగా శిక్షించడం జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ విద్యావంతులు అయినప్పుడే సమాజం అన్ని విధాలా పురోగతి దిశకు సాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిఘా నీడ.. భద్రత బడా!

నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో నేరస్తులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు, పోలీసులకు దొరక్కుండా తెలివిగా నేరాలు చేస్తున్నారు. అక్రమార్కులు, చోరుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైంది. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో మన ఇళ్లు, దుకాణాలపై నిఘా నీడ ఏర్పాటు చేయాల్సి ఉంది. సీసీ కెమెరాలతో చోరీలు, అరాచకాలకు అడ్డుకట్ట వేయవచ్చు. వీటిలో నమోదైన దృశ్యాలతో నేరస్తులను సులువుగా పట్టుకోవచ్చు. ఈ క్రమంలో ఇళ్లు, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రత్యేక కథనం.

- నూతన సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి
- అత్యాధునిక నిఘా అవసరం





సీసీ కెమెరాలు

నగరి: జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు విస్తరిస్తుండడంతో భద్రతా అంశంలో పోలీసులతో పాటు ప్రజలు కూడా తమ సహకారాన్ని అందించాలని పోలీసు శాఖ సూచిస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని అందులో భాగంగా ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. విజిబుల్ పోలీసింగ్‌తో చోరీలు, నేరాలకు పాల్పడే వారిని త్వరితగతిన పట్టుకునేందుకు వీలుంటుందని, తద్వారా నేరాలను అదుపు చేయవచ్చని భావిస్తోంది. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా నిమిత్తం నూతనంగా సిద్ధం చేసిన సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలు, దుకాణ యజమానులకు వివరించే ప్రయత్నాలు చేశారు. ఇదివరకు ఉపయోగించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు నేరాల నియంత్రణలో సాయపడుతూ వచ్చాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అమర్చిన సీసీ టీవీ కెమెరాలు మరింత ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సాంకేతికతను సరైన విధంగా ఉపయోగించడంతో ప్రజలు తమ ఆస్తులను కాపాడుకోవడంలో ఒక భాగం అవుతారంటున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కొంత ఖర్చుతో కూడినదే అయినా భద్రతా పరంగా అది అవసరం అయినందున ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఎలాంటి సీసీ కెమెరాలు వాడాలంటే..

ఏదో ఒక సీసీ కెమెరాను ఇళ్లకు, దుకాణాలకు అమర్చడంలో ప్రయోజనం ఉండదు. బయటి వైపు ఉంచే కెమెరాల్లో టీపో క్రిష్టల్ క్లియర్ 2కే క్యూహెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలి. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటక్షన్, టువే ఆడియో, స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాస్ సౌకర్యాలు ఉంటాయి. దీంతో నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చు. అలాగే లోపలవైపు ఉంచే కెమెరాల్లో పాన్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానం గానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పనిచేసే 3ఎంపీ స్మార్ట్ కెమెట్ హైబ్రిడ్ పరిజ్ఞానం గానీ ఉండాలి. ఈ కెమెరాల్లో పాన్ ఫీచర్, హై రెజుల్యూషన్, వైఫై కనెక్టివిటీ, నైట్ విజన్, టువే ఆడియో ఉంటుంది. ఇవి దుకాణాలకు ఉపయోగపడుతుంది. ఊరికి దూరంగా వైఫై సదుపాయం లేని ఇళ్లకు సోలార్ 4జీ సిమ్, 4ఎంపీ పాన్, టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీ టీవీ కెమెరాలు వాడాలి. ఇది సిమ్ సపోర్టుతో పనిచేస్తుంది. వాటర్ ప్రూఫ్ సౌకర్యం ఉంటుంది. రికార్డింగ్ చేసే అంశాలు స్పష్టంగా ఉంటాయి. జూమ్ సౌకర్యం కూడా ఉంటుంది.

నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర

అనుమానితులు, నేరస్తులను గుర్తించడంలో సాక్ష్యాలను సేకరించడంలో ప్రధాన భూమికను పోషిస్తాయి. కెమెరాల ద్వారా పొందిన సాక్ష్యాలు న్యాయ ప్రక్రియలో కీలకంగా ఉంటాయి. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిని గుర్తించడంలోను, పట్టణ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి.

అత్యాధునిక సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా



సీసీ కెమెరాలు ప్రజల భద్రతలో ఒక భాగమే అని గుర్తించి ప్రజలు సహకారం అందించాలి. ఇప్పటికే భద్రతలో భాగంగా డయల్ 100, 112, వాట్సాప్ నంబర్ 9440900005, ఎల్‌హెచ్‌ఎంఎస్‌లు వాడుకలో ఉన్నాయి. పటిష్ట భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానం వాడుకోవాలన్నదే పోలీసు శాఖ ఆలోచన. కెమెరాల ఏర్పాటు కోసం కొంత ఖర్చు చేసినా దాని ప్రయోజనం ఎంతో ఉంటుందని ఇళ్ల యజమానులు, దుకాణయజమానులు తెలుసుకోవాలి. అత్యాధునిక సాంకేతకతో కూడిన సీసీ కెమెరాలన్నీ మార్కెట్‌లో సులభంగానే లభిస్తాయి.

–విక్రమ్, సీఐ, నగరి

మర్యాదపూర్వక కలయిక



ఎంపీ మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న రెడ్‌బుక్‌లో భాగంగా అక్రమ కేసులో బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని జీడీ నెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి, నేతలు తిరుపతి ఎంపీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కృపాలక్ష్మి, నేతలతో కలిసి మిథున్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డికి నేతలు, కార్యకర్తలు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ చందురాజు పాల్గొన్నారు.

సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు

- ఇబ్బంది పడిన రోగులు



పీహెచ్‌సీలో మందులు తీసుకుంటున్న రోగులు

పాలసముద్రం: స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలకు వచ్చిన రోగులు బుధవారం వైద్యం అందక ఇబ్బందులు పడ్డారు. రోగులు పీహెచ్‌సీకి వైద్య పరీక్షలు వచ్చారు. డాక్టర్లు రాకపోవడంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్నారని తెలిపారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ వైద్యశిబిరంలో కూడా వైద్యులు లేకపోవడంతో వైద్యపరీక్షలకు వచ్చిన రోగులు బీపీ, షుగర్ చెక్ చేసుకుని ఇంటికెళ్లిపోయారు.

రైతులకు జీఎస్టీపై అవగాహన



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

నగరి: స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో బుధవారం వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్ అధికారులు రైతులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్, పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, బయో పెస్టిసైడ్స్, స్ప్రింక్లర్, డ్రిప్ పరికరాలు, డీజిల్ ఇంజిన్లపై జీఎస్టీ 12శాతం నుంచి 5 శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ వాణి, వ్యవసాయశాఖ ఏడీఏ కవిత, పశుసంవర్ధక శాఖ ఏడీ వాసు, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ పూర్ణం, వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బాలాజి, పశువైద్యులు నరేష్, కుమార్, సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

పనిముట్లపై జీఎస్టీ తగ్గింపు

విజయపురం: వ్యవసాయ పనిముట్లపై 5శాతం జీఎస్టీ తగ్గించినట్లు ఏఓ రజినీకుమారి తెలిపారు. బుధవారం ఎంపీపీ బాలాజీ ఆధ్వర్యంలో కోసలనగరం సచివాలయ పరిధిలో వ్యవసాయ పనిముట్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతి వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గించిందని తెలిపారు. దీంతో రానున్న రోజుల్లో ప్రతి వ్యవసాయ పనిముట్లపై 5శాతం జీఎస్టీ తగ్గడంతో ప్రతి రైతు వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసుకోవాలన్నారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

డిజిటల్ బుక్ ఒక బ్రహ్మాస్త్రం



పాలసముద్రంలో డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు



పెనుమూరులో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

పాలసముద్రం: రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి నేతలు చేస్తున్న దాడులు, అక్రమ కేసులకు భవిష్యత్‌లో దీటైన సమాధానం ఇచ్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, మండల కన్వీనర్ తులసియాదవ్ తెలిపారు. బుధవారం పాలసముద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు ప్రజలు డిజిటల్ బుక్‌ను వినియోగించుకోవాలని సూచిస్తూ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నేతలు రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టులు చేయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. కూటమి నేతల అక్రమాలు, బెదిరింపులు, అక్రమ కేసులు క్యూఆర్ కోడ్ ద్వారా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కూటమి నేతలు, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటారని వివరించారు. బాధితులందరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికార మదంతో పేట్రేగుతున్న వారిని వదిలేది లేదన్నారు. ఎంపీటీసీ గోవిందరాజులు, మండల మహిళా అధ్యక్షురాలు టి. రమాదేవి, పద్మనాథనాయుడు, షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, ప్రకాష్, గోపాల్, వేణు, ప్రేమ్ కుమార్, ఆనట్స్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా డిజిటల్ బుక్

పెనుమూరు (కార్వేటినగరం): ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా నిలిచేందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని నియోజకవర్గం పరిశీలకులు పి.రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్ పేరిట వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు, వేధింపులు, అరాచకాలు అధికమయ్యాయని, ప్రతిపక్షాన్ని వేధించడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. ఈక్రమంలో డిజిటల్ బుక్ పార్టీ శ్రేణులకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. కూటమి నేతల నుంచి వేధింపులు, అన్యాయాలకు గురైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్‌లో తమకు జరిగిన అన్యాయాన్ని నమోదు చేయాలన్నారు. మాజీ మండల కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోదండన్, సర్పంచ్ దూదిమోహన్, కృష్ణారెడ్డి, చెన్నకేశవనాయుడు, భూపతినాయుడు, దాము,మురళీ, ఉమాపతి పాల్గొన్నారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శిరీష డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులతో నినాదాలు చేశారు. పీహెచ్‌సీలో ఏళ్ల తరబడి పనిచేసినా ఉద్యోగోన్నతులు లేవన్నారు. పొరుగు రాష్ట్రాల్లో టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పిస్తుంటే..మన రాష్ట్రంలో మాత్రం ఈ విధానం అమలు కావడం లేదన్నారు. జీఓ 99 ద్వారా ఇన్ సర్వీస్ పీజీ కోటా కేవలం 15శాతానికి తగ్గించి..ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడం సరికాదన్నారు. దీంతో పాటు పలు రకాల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వైద్యులు మునికుమార్, చంద్ర మహేష్, విజయలక్ష్మి, హరినాథ్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న వైద్యులు

చెత్తసేకరణ విధిగా పాటించండి



అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

కార్వేటినగరం: గ్రామాల్లో చెత్తసేకరణ కార్యక్రమాన్ని పంచాయతీ అధికారులు విధిగా పాటించాలని జిల్లా జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల అవగాహన కార్యక్రమానికి హాజరైన జెడ్పీ సీఈఓ, డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కార్యక్రమంలో భాగంగా కార్యదర్శులు చెత్తసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి పారిశుధ్య కార్మికులు వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించే విధంగా చూడాలని ఆదేశించారు. ఎంపీడీఓ చంద్రమౌళి, మేజర్ పంచాయతీ ఈఓ నాగరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రీడింగ్ తీయొద్దు.. మాకు ఉచితం

- మీటర్ రీడింగ్ బాయ్‌ని అడ్డుకున్న మరమగ్గ కార్మికులు



రీడింగ్ బాయ్‌ను అడ్డుకుంటున్న మరమగ్గ కార్మికులు

పుత్తూరు: మాకు 500 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించింది. కేబినెట్‌లో తీర్మానించేశారు. జీఓ కూడా విడుదల చేసేశారు. ఇంకా రీడింగ్ తీయడానికి వస్తే ఒప్పుకోం అంటూ విద్యుత్ మీటర్ రీడింగ్ బాయ్‌ని పుత్తూరు మరమగ్గ కార్మికులు అడ్డుకున్నారు. బుధవారం యథావిధిగా మీటర్ల రీడింగ్ తీయడానికి వచ్చిన రీడింగ్‌బాయ్‌కి ఈ అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళితే గత ఏడాది సెప్టెంబర్‌లో పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో స్థానిక మరమగ్గ కార్మికులు సంబరాలు చేసుకున్నారు. అయితే ఇచ్చిన ప్రకటన బిల్లులో కనిపించలేదు. ఈ ఏడాది మార్చి 16వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉచిత విద్యుత్‌పై నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. అయినా బిల్లులో మార్పు రాలేదు. అనంతరం ఆగస్టు 7న చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా ఆరోజు నుంచి ఉచిత విద్యుత్ అమలు అంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. దీంతో ఆగస్టులో వచ్చే బిల్లును చూసిన నేత కార్మికులకు నిరాశే మిగిలింది. ఉచితంకాదు కదా వచ్చే బిల్లులు మరింత ఎక్కువగా వచ్చింది. సెప్టెంబర్‌లోనూ ఉచితం అందలేదు. దీనిపై మరమగ్గ కార్మికులు రోడ్డెక్కడం, విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ దశలో వచ్చే నెల బిల్లుకు ప్రస్తుతం విద్యుత్‌శాఖ నుంచి రీడింగ్ తీయడానికి రావడం మరమగ్గ కార్మికులకు ఆగ్రహం తెప్పించింది. ఉచితం అంటూ నెలల తరబడి ఊరిస్తున్నారా.. రీడింగ్ తీయడానికి ఒప్పుకోం అంటూ అడ్డుకున్నారు. మాకు 500 యూనిట్లలోపే వచ్చింది మాకు ఉచితం నువ్వు వెళ్లు అనడంతో విద్యుత్ రీడింగ్ బాయ్ వెనుదిరగాల్సి వచ్చింది.

ఆయుధపూజ సందడి









నగరిఓంశక్తి ఆలయంలో భక్తులకు అన్నదానం, చందన అలంకరణలో బాటగంగమ్మ, శాకాంబరీ దేవిగా అల్లి యల్లమ్మ తల్లి, నగరిలో పుష్పార్చన చేస్తున్న ఆర్కే రోజా

- వైభవంగా ఆయుధ, సరస్వతి పూజ

నగరి: పట్టణంలో బుధవారం ఆయుధపూజ సందడి నెలకొంది. విజయదశమికి ముందురోజు దుకాణాల వద్ద ఆయుధపూజలు నిర్వహించడం పరిపాటి కావడంతో ఉదయం నుంచే పట్టణ పరిధిలోని వ్యాపారస్తులు దుకాణాలను శుభ్రం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. దుకాణాలను మావిడాకులతోను, రంగురంగుల కాగితాలతోనూ అలంకరించారు. బస్టాండు ప్రాంగణంలో గుమ్మడికాయలు, బొరుగులు, అరటిచెట్లు, పూజాసామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి. దుకాణదారులు ప్రతిరోజూ వాడే సామగ్రిని, వాహనాలను శుభ్రపరచి పూజలు చేశారు. ఇళ్లలో వాహనాలకు, వస్తువులకు, విద్యార్థులు పుస్తకాలను ఉంచి పూజలు చేశారు. శరన్నవ రాత్రుల్లో భాగంగా ఆలయాల్లో అమ్మవార్లకు వివిధ అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కామాక్షిసమేత కరకంఠేశ్వర ఆలయంలోని కామాక్షిదేవికి మహిషాసుర మర్ధిని అలంకరణ చేశారు. బైపాస్ కూడలిలోని ఓంశక్తి ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అన్నదానం చేశారు.

మాజీ మంత్రి ఆర్కే రోజా పూజలు

నగరి: మాజీ మంత్రి ఆర్కేరోజా నవరాత్రి పూజల్లో భాగంగా ఆయుధ పూజను పురస్కరించుకొని బుధవారం స్వగృహంలోని అమ్మవారు, వారాహి దేవతల విగ్రహాలకు అభిషేకాలు, కలశ పూజలు నిర్వహించారు. తామరపువ్వులు, శంకుపుష్పాలు, పారిజాత పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ బంగారమ్మ మహిషాసురమర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా పచ్చికాపల్లం రోడ్డులోని బాటగంగమ్మ చందన అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఆలత్తూరు సమీపంలోని శ్రీముత్యాలమ్మ ఆలయంలో మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని అల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో శాకాంబరీ దేవిగా అల్లియల్లమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. సుధాకర్‌రెడ్డి, చూడామణి ఆచారి, నందా కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లిలోని శ్రీఆరిమాని గంగమ్మ శ్రీలలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. వేణుగోపాలపురం పంచాయతీ సపర్వరాజపురంలోని శ్రీమూర్తి అమ్మవారు శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

విద్యుత్ సమస్యలపై 4 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యలపై 4 వినతులు అందాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇచ్చిన అర్జీలలో నమోదైన నాలుగింటిలో మూడింటికి పరిష్కారం చూపామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఈఈలు ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.